క్లుప్తంగా

24న సర్వసభ్య సమావేశం

అడ్డాకుల: మండల కేంద్రంలో ఈనెల 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంజుల శనివారం తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

ఆలయ కమిటీ ఎన్నిక

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ ఆంజనేయస్వామి ఆలయ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.వీరన్న, అధ్యక్షుడిగా కె. వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఆగిరి సత్యం, కె.పవన్, జి. నారాయణ, పి. నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రఘునందన్ గౌడ్, సహ కార్యదర్శులుగా ప్రభులింగం, సురేష్, కోశాధికారిగా ఆర్. రామాంజనేయులుతో పాటు సభ్యులు, సలహాదారులు ఎన్నికయ్యారు.

24న టాలెంట్‌టెస్ట్

కోయిల్‌కొండ: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు కోయిల్‌కొండ ఉన్నతపాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రెడ్డి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

అలరించిన పద్యనాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీపాలమూరు ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో పద్యనాటకోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్త చింతామణి, మయసభ ధుర్యోధన ఏకపాత్రభినయం నాటక ప్రదర్శనలు నిర్వహించారు. పాత్రధారులు చక్కటి అభినయంతో అలరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఆర్టీయూ నూతన సంవత్సర డైరీని కలెక్టర్ రవినాయక్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ్‌గౌడ్, రఘురాంరెడ్డి, గోపాల్‌నాయక్, బాలకిష్టయ్య, కృష్ణయ్య, గడ్డమీద కృష్ణయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ నిరుద్యోగ పోరాట సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు.

దిష్టిబొమ్మ దహనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గుంటూరు కారం సినిమాలో కమ్యూనిస్టు యోధులు మార్క్స్, లెనిన్ వంటి పేర్లను పెట్టడం పై అభ్యంతరం తెలుపుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అగౌరవ పర్చే విధంగా ఉన్న సన్నివేశాలు, పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. భరత్, నందు , రాము, సురేష్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

హన్వాడ: వనపర్తిలో ఈనెల 28న నిర్వహించనున్న పంచాయతీ కార్మికుల సమ్మెను విజయవం తం చేయాలని మండల అధ్యక్షుడు దర్పల్లి బాలకిష్టయ్య పిలుపు నిచ్చారు. శనివారం మండలకేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, రంగయ్య, రాములు, భీమయ్య, చెన్నయ్య, వెంకటయ్య, అంజయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితేనే ఆశించిన ఫలితాలు



జడ్చర్ల టౌన్: ఇష్టంగా చదివితే ఆశించిన ఫలితాలు వస్తాయని డీఈఓ రవీందర్ అన్నారు. శనివారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో తెలంగాణ మాథమెటిక్స్ ఫోరం నిర్వహించిన మండలస్థాయి పదోతరగతి గణితం టాలెంట్ టెస్ట్‌ను సందర్శించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి గణితం ట్యాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. తెలుగు మీడియంలో కన్మనూర్ విద్యార్థిని రాణి, పొన్నకల్ విద్యార్థిని వర్షిత, అడ్డాకుల విద్యార్థిని సౌమ్యలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ఇంగ్లీష్ మీడియంలో అడ్డాకుల విద్యార్థులు భానుప్రసాద్, మౌనిక, అమ్రు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

దరఖాస్తుల ఆహ్వానం

దేవరకద్ర: పట్టణంలో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతిలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని టీఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ సలీముద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6 వరకు అవకాశం ఉందన్నారు. మైనార్టీలకు ప్రాధాన్యత ఉంటుందని ఆ తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను లక్కీడీప్ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అలాగే మైనార్టీ గురుకులలో బ్యాక్‌లాగ్ ఖాళీలు ఉన్నాయని ఇందులో 6, 7, 8 తరగతులకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిర్వహణలో అలసత్వం వద్దు

నర్సరీలను పరిశీలించిన కలెక్టర్



కాకర్లపహాడ్‌లోని నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

నవాబుపేట: నర్సరీల నిర్వహణ పకడ్బందీగా జరగాలని ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కాకర్లపహాడ్, రుద్రారం గ్రామాల్లో పర్యటించారు. నర్సరీల నిర్వహణ, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు తనిఖీ చేశారు. నర్సరీల్లో టార్గెట్ ప్రకారం మొక్కలు పెంచాలని సూచించారు. నర్సరీలను మండల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డుల్లో చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీ చెత్త వేరు చేయటం లాంటివి నిరంతరం జరగాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం విషయంపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తేనే మంచి ఫలితం వస్తుందని.. నిత్యం కార్యక్రమాలు కొనసాగాలన్నారు. అదేవిధంగా అధికారులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఉపాధి పథకంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు చూపించే పనులు, రైతులకు ఉపయోగపడే పనులు ఎంపిక చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. కార్యాచరణ రూపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రుద్రారంలో 32, 33 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కావాల్సిన సదుపాయలపై ఆరా తీశారు. ఓటర్ల జాబితా తదితరాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, సర్పంచ్‌లు జంగమ్మ, లలితమ్మ, నర్సింహులు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ జ్యోతీ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో మాట్లాడుతున్న భూసేకరణ అదనపు కలెక్టర్ జ్యోతి

జడ్చర్ల: ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం నిరంతం కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ ఆర్‌అండ్‌ఆర్ పనులకు సంబంధించి భూసేకరణ అదనపు కలెక్టర్ జ్యోతి ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. పనులకు సంబంధించి బడ్జెట్ మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవార్డు పాసైన ఐదు తండాలకు దాదాపు రూ.116 కోట్లు విడుదల చేయించాలన్నారు. వల్లూరు, ఉదండాపూర్‌ల ఆర్‌అండ్‌ఆర్ సర్వే దాదాపు 90 శాతం పూర్తైనట్లు వివరించారు. నిర్వాసితులు సహకరిస్తే సర్వే పూర్తి చేసి అవార్డు పాస్ చేస్తామన్నారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు చర్యలు చేపడుతామన్నారు. కాగా నిర్వాసితులకు న్యాయం చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామని.. పూర్తి నివేదికను సమర్పించాల్సిందిగా ఎమ్మెల్యే అదనపు కలెక్టర్‌ను కోరారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముదిరెడ్డిపల్లి, గొల్లపల్లి, ఈర్లపల్లి గ్రామాల శివార్లలో వెంచర్లు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని సామాజిక కార్యకర్త వెంకటయ్య ఫిర్యాదు చేశారు. గాంధీ ట్రస్టు భూములను అక్రమంగా విక్రయిస్తున్నారని సామాజిక కార్యకర్తలు అనిల్‌కుమార్, అయ్యన్నలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జడ్చర్ల జెడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి నిధులు, అభివృద్ధి పనులు మంజూరు చేయాలని హెచ్ఎం మంజులాదేవి ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, కౌన్సిలర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాలను తరలించాలి

జడ్చర్ల: మాచారం శివారులో ఇటీవల ఏర్పాటు చేసిన కాంక్రీట్ మిక్సింగ్ యంత్రాలను తరలించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన మిక్సింగ్ ప్లాంట్‌ను సందర్శించి విచారించారు. గ్రామానికి చేరువలో ఏర్పాటు చేయడం వలన కంకర, దుమ్ము, ధూళీ ఇళ్లలో చేరుతుందని.. గ్రామస్తులు ఆయనకు వివరించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్బండవర్గాల అభ్యున్నతే ధ్యేయం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్/మహమ్మదాబాద్: సబ్బండవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం మహమ్మదాబాద్ మండల కేంద్రంలో పీఆర్‌టీయూ టీఎస్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నాగలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీఓ శంకర్‌నాయక్, ఎంపీటీసీ బాలయ్య, కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల శ్రద్ధ అవసరం



అడ్డాకుల: విద్యార్థులపై ఇంటి వద్ద తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని హెచ్ఎం కురుమూర్తి అన్నారు. కందూర్ జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల ప్రగతి, హాజరు మెరుగుదల, ప్రవర్తన తదితరాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ఉపాధ్యాయులు మురళీధర్, హరిప్రసాద్, విశ్వ స్వరూప పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న కురుమూర్తి

అడ్డాకుల: కేంద్రం ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకుని, కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేషగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా శనివారం కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈనెల 26న ఎద్దుల బండ్లు, ఆటోలు, బైక్ ర్యాలీలు చేపట్టాలని సూచించారు. 28న సమ్మె నోటీసులను అందజేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి మొదటి వారంలో సంతకాల సేకరణకు పిలుపునిచ్చారు. రవిసాగర్, నాగన్న, కురుమయ్య, శాంసన్, సుందర్‌రాజ్, యూసుఫ్, లక్ష్మమ్మ, సువర్ణ, యేసమ్మ, అరుణ, రాములమ్మ ఉన్నారు.

బకాయిలు చెల్లించండి



సమావేశంలో వాగ్వాదానికి దిగిన సభ్యులు

దేవరకద్ర: గ్రామ పంచాయతీలలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, అదేవిధంగా సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అవకాశం ఇవ్వాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేసి ఆమోదించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చ చేపట్టారు. సర్పంచ్‌ల తరపున మండల అధ్యక్షుడు శివరాజు, యుగంధర్‌రెడ్డి తీర్మానం చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

పథకాల అమలుపై వాగ్వివాదం

కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇంకా అమలు చేయడం లేదని సభ్యులు తిరుపతయ్య, శివరాజులు ఆరోపించారు. కాగా ప్రభుత్వం సిద్ధ అవుతోందని కాంగ్రెస్ తరుపు సభ్యులు రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొద్దిసేపు సభ్యుల మధ్య వాగ్వివాదం నడిచింది.

బకాయిలు చెల్లిస్తేనే ఉచిత విద్యుత్

గతంలో పేరుకు పోయిన బకాయిలు చెల్లిస్తేనే ఉచిత విద్యుత్ పథకానికి అర్హులవుతారని ఏఈ సత్యయ్య తెలిపారు. రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో మొత్తం రూ. కోటీ 31 లక్షల విద్యుత్ బకాయిలు ఉన్నాయని.. అన్ని చెల్లిస్తేనే అర్హులవుతారని అన్నారు. పట్టణానికి రెండు ఫీడర్ల ద్వార విద్యుత్ సరాఫరా చేస్తామని వివరించారు. తద్వారా ఇబ్బందులు తొలగుతాయని వివరించారు. అదేవిధంగా వివిధ అంశాలపై అధికారులు ఏజెండా చదివి వినిపించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేకపూజలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన శ్రీఆదిఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని తమలపాకులు, పూలతో విశేషంగా అలంకరించారు. అష్టోత్తర శతనామావళి చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అర్చకులు రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ నిర్మాణానికి కృషి చేస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు కావల్సిన వసతి గృహాల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పలు విద్యార్థి సంఘాల నాయకులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే బాలికలకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జిల్లా కోఆర్డినేటర్‌గా రాంచందర్‌నాయక్ ఎంపికకావడం పై యెన్నం హర్షం వ్యక్తం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఆయనను సన్మానించి అభినందించారు. ఎస్టీసెల్ అధ్యక్షుడు లింగంనాయక్, కిషన్‌నాయక్, కృష్ణయ్య యాదవ్, వెంకటయ్య, అబ్దుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేయాలి



కోయిల్‌కొండ: గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న నర్సరీల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శనివారం దమాయపల్లిలో ఈజీఎస్ ద్వారా పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. పంచాయతీ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి చైతన్య తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



ఓటర్ నమోదుపై ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

మిడ్జిల్: మండలంలో ఓటరు నమోదు కేంద్రాలను శనివారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న విధులపై ఆరాతీశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. ఓటరు నమోదు వివరాలు జాగ్రత్తగా సరిచూసుకోవాలని సూచించారు. అదేవిధంగా వల్లభరావుపల్లిలో 251, 252 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ రాజునాయక్ తదితరులు ఉన్నారు.

'హిందువుల కల నెరవేరుతోంది'



మాట్లాడుతున్న వసంతం వెంకటేశ్

స్టేషన్ మహబూబ్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో బాలరాముడి ప్రతిష్టాపనతో ప్రపంచంలోని కోట్లాదిమంది హిందువుల కల నెరవేరుతోందని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర కమిటీ జిల్లా సంయోజకులు వసంతం వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మంగారి మఠంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపేట, పాలమూరు జిల్లాల్లో ఈ నెల 1 నుంచి 15 వరకు 2,283 మంది జట్లుగా 25,833 మంది కార్యకర్తలు గడప గడపకు తిరిగి 3.75 లక్షల కుటుంబాలకు శ్రీరాముడి అక్షింతలను అందజేశారన్నారు. ప్రతి గ్రామంలోని ఆలయాల్లో శ్రీరామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. ఒకరోజు ముందు ఆలయాలు, ఇళ్లను శుభ్రం చేసుకోవాలని, మామిడి తోరణాలతో అలంకరించుకోవాలన్నారు. సోమవారం ఇంటిల్లిపాది పూజలు నిర్వహించుకొని కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, రామనామ సంకీర్తనలు, భజనలు ఆలపించాలన్నారు. ప్రముఖ ఆలయాల్లో అయోధ్యలో జరిగే ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వీక్షించడానికి ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారని, ఉదయం 11 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 12.29 గంటలకు రాములవారి విగ్రహ ప్రతిష్టాపన అయిన వెంటనే ఆలయాల్లో మంగళహారతులు, ఒకేసారి గంటానాదం మోగించాలని, శంఖాలు పూరించాలన్నారు. తీర్థక్షేత్ర నగర సంయోజకులు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ హైందవుల 500 ఏళ్ల పోరాట ఫలితమే అయోధ్య శ్రీరాముని మందిర రూపం అన్నారు. ప్రతిష్టాపన అనంతరం హైందవులు ఇళ్లకు వెళ్లి అక్షింతలతో ఆశీర్వచనాలు తీసుకోవాలని, సాయంత్రం ఇళ్ల ఎదుట ఐదు దీపాలు వెలిగించాలని కోరారు. సమావేశంలో సభ్యులు లక్ష్మారెడ్డి, బుచ్చారెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణ, రఘురాంరెడ్డి, జనార్దన్, సంపత్, చంద్రమౌళిగుప్తా, చంద్రయ్య, హన్మంతు, శ్రీకాంత్, జనార్దన్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా 33 కేవీలైన్ బదలాయింపు



న్యూటౌన్ చౌరస్తాలో విద్యుత్ పనులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో జాతీయ రహదారిపై ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ బదలాయింపు పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం న్యూటౌన్ చౌరస్తాలో పాత స్తంభాలకు ఉన్న లైన్‌ను బదలాయించారు. విద్యుత్ పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా వాహనాలను దారి మళ్లించారు. కాగా పనుల కారణంగా విద్యుత్ కోతలు ఉంటాయని పట్టణ టూటౌన్ ఏఈ ఆదిత్య ముందుగానే ప్రకటన ఇచ్చారు. సబ్‌స్టేషన్‌కు వచ్చే ప్రధాన 33 కేవీ లైన్ పనులు జరుగుతున్నాయని ట్రాన్స్ కో అధికారి బీచుపల్లి తెలిపారు. విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు సహకరించాలని కోరారు.

నిరుపయోగంగా మరుగు దొడ్లు

చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రం ఆవరణలో నిర్మించిన మరుగు దొడ్లు నిరుపయోగంగా మారాయి. కేంద్రానికి వచ్చే రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గత సంవత్సరం వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అయితే అధికారులు మధ్యలోనే పనులు వదిలేశారు. దీంతో ప్రస్తుతం అవి వినియోగానికి పనికిరాకుండా పోయాయి. వాటి సమీపంలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో సిబ్బంది నిధులు దుర్వినియోగం చేశారని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. విషయంపై సీఈఓ బషీర్‌ను వివరణ కోరగా మరుగు దొడ్ల నిర్మాణానికి కేటాయించిన నిధుల విషయం తనకు తెలియదన్నారు. అది తాను రాకముందే జరిగిందని పేర్కొన్నారు.

మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పదవుల కేటాయింపులో మాదిగలకు సముచితస్థానం కల్పించాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేల్లో ఒకరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతో పాటు మరో ఇద్దరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా లోక్‌సభ రెండు, రాజ్యసభ ఒకటి, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లోనూ స్థానం కల్పించాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిగలకు ఒక్క మంత్రి ఇవ్వలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో గాలి ప్రొఫెసర్ వినోద్‌కుమార్, కనకరత్నం, వివిధ సంఘాల నాయకులు జాజుల శ్రీనివాస్, కొమ్ము ప్రవీణ్‌కుమార్, రాజారత్నం, మంగేష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజూ తనిఖీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మూడోరోజు శనివారం 7, 8, 19, 40, 41, 42వ వార్డుల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, ఏసీపీ జోత్స్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి, ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

'నాసిరకంగా పనులు'

భూత్పూర్: పట్టణంలోని 9వ వార్డులో డ్రెయినేజీ పనులు నాసిరకంగా చేపట్టడటంతో దానిపై ఏర్పాటు చేసిన పైకప్పు కూలిపోయిందని బీఆర్ఎస్ నేత మహ్మద్ సాధిక్ ఆరోపించారు. దీంతో ద్విచక్రవాహనాలు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారిందన్నారు. డ్రెయినేజీలో మురుగుసైతం నెలల తరబడిగా తీయకపోవడంతో దుర్గంధంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని.. అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

'నవోదయ' పరీక్షకు 70మంది గైర్హాజరు



జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో శనివారం జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు 70మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 248మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 178 మంది మాత్రమే వచ్చినట్లు సూపరింటెండెంట్ సయ్యద్ ఇబ్రహీం తెలియజేశారు.

22న సెలవు ప్రకటించాలి

హన్వాడ: అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న ప్రభుత్వం అధికారికంగా సెలవును ప్రకటించాలని బీజేపీ నాయకులు రఘురాం గౌడ్ తదితరులు శనివారం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా సెలవును ప్రకటించిందని.. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకటన చేయాలని అన్నారు.

ప్రైవేటు ఆస్పత్రిపై ఫిర్యాదు

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిపై శనివారం తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, కలెక్టరేట్ ఏఓకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో ల్యాబోరేటరీ పరీక్షలతో పాటు ట్యాబ్లెట్స్, ఆస్పత్రికి చెల్లించిన డబ్బులకు సంబంధించి ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలుకు విరుద్ధంగా పనిచేస్తున్న ఆస్పత్రిపై చర్య తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సంతోష్ రాథోడ్, ఛత్రపతి, రాజేష్, రఘు, సంతోష్ ఉన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో శనివారం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తోందన్నారు. సహకార కేంద్రం ద్వారా ఎరువులను పంపిణీ చేస్తుందన్నారు. సీఈఓ బషీర్ మాట్లాడుతూ అప్పంపల్లి వ్యవసాయ సహకార సంఘం కేంద్రంలో రైతులకు అందుబాటులో యూరియా ఎరువులు ఉన్నాయన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పాసు బుక్కు తీసువచ్చి బస్తాకు రూ. 270 చెల్లించి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది గోవిందరాజు, శివ, జుబేర్, కాంగ్రెస్ నాయకులు సుధర్శన్, పోలీస్‌రాఘవరెడ్డి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పాషా, మహేందర్‌ల తోపాటు పలువురు పాల్గొన్నారు.